# సాక్షి నిర్మల్

ఆదివారం । 21 । జూలై । 2024






**అధిక తేమతో పంటలకు చేటు**

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంటచేలల్లో నీరు నిలుస్తోంది. ఎక్కువ కాలం చేలల్లో నీరు నిలిచి ఉంటే తేమ అధికమై పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదముంది. 8లో▸



**హైవే నిర్వహణపై పట్టింపేది?**

భైంసా పట్టణం మీదుగా వెళ్తున్న 61వ జాతీయ రహదారి నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
27.0 /24.0

**వాతావరణం**

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లా వ్యాప్తంగా వర్షం కురిసే అవకాశముంది.

## న్యూస్‌రీల్

### ఈవీఎం గోదాం పరిశీలన



ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్

**నిర్మల్‌చైన్‌గేట్:** కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాంను శనివారం కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. వారి వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాస్, ఈడీఎం నదీం, వివిధ పార్టీల ప్రతినిధులు శ్రావణ్‌రెడ్డి, సిరికొండ రమేశ్, మజార్, గంగ్రత్ రమేశ్, అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

**నిర్మల్‌టౌన్:** వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జానకీ షర్మిల శనివారం ఓ ప్రకటనలో సూచించారు. పోలీస్ యంత్రాంగం, శిక్షణ పొందిన పోలీస్ బృందం నిరంతరం అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే 'డయల్ 100'కు లేదా కంట్రోల్ రూమ్ 8712659555 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. వాగులు, ప్రాజెక్టులు, కాలువలు, నదులు, రిజర్వాయర్లు, చెరువుల వద్దకు వెళ్లొద్దని తెలిపారు. స్వర్ణ, కడెం ప్రాజెక్టులు, గడ్డెన్న వాగు పరీవాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని, రైతులు విద్యుత్ ప్రమాదాలకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని వివరించారు. వాహనదారులు రోడ్లపై గుంతలు గమనించాలని, వర్షాలు కురుస్తున్నపుడు నెమ్మదిగా వెళ్లాలని సూచించారు.

### నిబద్ధతతో పనిచేస్తేనే గుర్తింపు



పాండునాయక్‌ను అభినందిస్తున్న ఏఎస్పీ

**భైంసాటౌన్:** విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తే తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందని ఏఎస్పీ అవినాష్‌కుమార్ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన హిట్ అండ్ రన్ కేసులో నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన హెడ్‌కానిస్టేబుల్ పీ పాండునాయక్‌ను శనివారం ఆయన అభినందించారు. ఈ మేరకు తన కార్యాలయంలో శాలువాతో సన్మానించారు. ప్రజల్లో నమ్మకాన్ని పెంచేలా పోలీసులు నడుచుకోవాలని సూచించారు.

### బడి వేళల్లో మార్పు

**నిర్మల్ రూరల్:** జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పని వేళలు మారుస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఉదయం 9.30నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు నిర్వహిస్తుండగా, ఇకనుంచి ఉదయం 9నుంచి సాయంత్రం 4.15గంటల వరకు పాఠశాలలు నిర్వహించాలని ఆదేశించింది. దీంతో సోమవారం నుంచి కొత్త వేళలు అమలు కానున్నాయి. కాగా, మార్చిన వేళలు ఇప్పటికే ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో అమలవుతుండడం గమనార్హం.

### ప్రతీ సోమవారం విద్యుత్ సమస్యలపై ప్రజావాణి

**నిర్మల్‌చైన్‌గేట్:** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నట్లు ఎస్ఈ బీ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు ప్రతీ సెక్షన్, సబ్ డివిజన్, ఈఆర్వో డివిజన్ కార్యాలయాలు, మధ్యాహ్నం 3 నుంచి 5గంటల వరకు సర్కిల్ కార్యాలయాల్లో వినతులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

### 'కడెం' వద్ద అప్రమత్తం



కడెం ప్రాజెక్టుపై అధికారులు, సిబ్బంది

**కడెం:** కడెం ప్రాజెక్టుకు వరద ప్రవాహం పెరగడంతో నీటిపారుదల శాఖ అధికారులు శనివారం అప్రమత్తమయ్యారు. రెండేళ్లుగా ప్రాజెక్టుకు ఊహించని రీతిలో వరదలు రావడంతో ఉన్నతాధికారులు ఇరిగేషన్ సిబ్బందిని అలర్ట్ చేశారు. నిరంతరం ప్రాజెక్టును పర్యవేక్షిస్తున్నారు. ప్రాజెక్టుకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు.

# ముసురుకుంది!



ఖానాపూర్: తెగిన దిలావర్‌పూర్ మార్గంలో తాత్కాలిక రోడ్డు

- జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వాన
- క్రమంగా పెరుగుతున్న నీటిమట్టం
- 'కడెం'లోనే అత్యధిక వర్షపాతం
- ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటి విడుదల
- స్వర్ణ, గడ్డెన్నవాగుల్లోకి అంతంతే..
- తెగిన రెంకోనివాగు తాత్కాలిక రోడ్డు

**నిర్మల్:** జిల్లావ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి ముసురు పెట్టింది. ఎడతెరిపి లేకుండా వాన కురుస్తూనే ఉంది. క్రమంగా జలాశయాల్లోకి నీరు చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లోనూ వర్షాలు కురుస్తుండటంతో జిల్లాలోని ప్రాజెక్టుల్లోకి క్రమంగా ఇన్‌ఫ్లో కూడా పెరుగుతోంది. కడెం ప్రాజెక్టులోకి శనివారం సాయంత్రం వరకు 8వేల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో వస్తోంది. జిల్లాలో అత్యధికంగా కడెం మండలంలోనే వర్షం కురుస్తుండటం, ఎగువ ప్రాంతాల్లోనూ వర్షాలు పడుతుండటంతో మూడు గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదలడం ప్రారంభించారు. మహారాష్ట్ర ప్రాంతాల్లో భారీ వర్షాలు లేకపోవడంతో స్వర్ణ, గడ్డెన్నవాగు ప్రాజెక్టుల్లోకి ఇన్‌ఫ్లో పెరగడం లేదు. క్రమంగా నీటిప్రవాహాలు పెరుగుతుండటంతో తాత్కాలిక మట్టి రోడ్లు కొట్టుకుపోతున్నాయి.

**మబ్బుపట్టి.. ముసురుపెట్టి..**

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం, అల్పపీడనాల కారణంగా జిల్లాలోనూ వర్షం కురుస్తూనే ఉంది. జిల్లావ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకూ ముసురు పెట్టింది. వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రోజంతా మబ్బుపట్టి వాన కురుస్తూనే ఉంది. విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర పనులు చేసుకునేవారు రోజంతా వానతో ఇబ్బంది పడ్డారు. రోడ్లన్నీ బురదమయం కావడంతో రాకపోకలకూ ఇబ్బంది ఏర్పడింది.

**పెరుగుతున్న నీటిమట్టాలు**

జిల్లాలో అసలైన వానాకాలం సీజన్ ప్రారంభమైనట్లు కనిపించింది. రోజంతా ముసురుపెట్టి కురవడంతో భూగర్భ జలాలు పెరగడంతో పాటు క్రమంగా జలాశయాల్లోనూ నీటిమట్టం పెరుగుతోంది. జిల్లాతో పాటు ప్రాజెక్ట్ ఎగువ ప్రాంతాల్లో వర్షం కురుస్తుండటంతో 'కడెం'లోకి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. శనివారం సాయంత్రానికి 8వేలకు పైగా క్యూసెక్కుల చొప్పున వరద వస్తుండటంతో ముందస్తుగా, ప్రాజెక్ట్ అధికారులు రాత్రి ఏడుగంటల ప్రాంతంలో మూడుగేట్లు ఎత్తి 11వేల క్యూసెక్కుల చొప్పున దిగువకు వదులుతున్నారు. భైంసాలోని గడ్డెన్నవాగు, సారంగాపూర్ మండలంలోని స్వర్ణ ప్రాజెక్టుల్లోకి మాత్రం ఇన్‌ఫ్లో రావడం లేదు. స్వర్ణ ప్రాజెక్ట్‌లోకి నామమాత్రంగా 330 క్యూసెక్కులు వస్తుండగా, గడ్డెన్నవాగులోకి మాత్రం ఎలాంటి వరద లేదు. సరిహద్దులో గల ఈరెండు ప్రాజెక్టుల్లోకి నీళ్లు రావాలంటే మహారాష్ట్ర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవాల్సి ఉంటుంది. ఖానాపూర్ మండలంలోని దిలావర్‌పూర్ వెళ్లే మార్గంలో రెంకోని వాగుపై తాత్కాలికంగా వేసిన రోడ్డు కొట్టుకుపోయింది. వర్షానికి పలు వాగుల ఉధృతి క్రమంగా పెరుగుతోంది. దీంతో జిల్లాలో మరిన్ని తాత్కాలిక రోడ్డుమార్గాలు తెగిపోయే ప్రమాదముంది.

**కడెంలోనే అధికం..**

జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకూ ముసురు కొనసాగుతూనే ఉంది. శనివారం రోజంతా వర్షపాతం నివేదికలను పరిశీలిస్తే.. కడెం మండలంలోనే అత్యధికంగా 65.5మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా తానూరు మండలంలో 5.3 మిల్లీ మీటర్లు మాత్రమే కురిసింది.



లక్ష్మణచాంద: పొట్టపెల్లి సమీపంలో మొక్కజొన్న పంటలో నిలిచిన వర్షపునీరు

**మండలాల వారీగా వర్షపాతం**

| మండలం | మి.మీటర్లు |
|---|---|
| కడెం | 65.5 |
| ఖానాపూర్ | 62.5 |
| దస్తురాబాద్ | 53.8 |
| మామడ | 44.8 |
| పెంబి | 43.8 |
| లక్ష్మణచాంద | 36.0 |
| నిర్మల్ | 24.8 |
| నిర్మల్‌రూరల్ | 24.0 |
| దిలావర్‌పూర్ | 17.8 |
| సారంగాపూర్ | 13.3 |
| సోన్ | 13.0 |
| నర్సాపూర్(జి) | 12.8 |
| భైంసా | 12.3 |
| కుభీర్ | 2.0 |
| కుంటాల | 11.3 |
| ముధోల్ | 10.3 |
| లోకేశ్వరం | 8.8 |
| బాసర | 7.5 |
| తానూరు | 5.3 |

## 'చరిత్రలో నిలిచేలా రుణమాఫీ'



మాట్లాడుతున్న ఇంద్రకరణ్‌రెడ్డి

**నిర్మల్:** దేశంలో ఎక్కడా రూ.2లక్షల రైతు రుణమాఫీ చేసిన చరిత్ర లేదని, రాష్ట్రప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని తన నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం రూ.లక్షలోపు రుణమాఫీ కొనసాగుతోందని, తర్వాత రూ.1.50లక్షలు, రూ.2లక్షల లోపు రుణాలను మాఫీ చేయనున్నట్లు తెలిపారు. పట్టాపాసుపుస్తకం ప్రామాణికంగానే మాఫీ కొనసాగుతోందని, ఏదైనా సమస్య ఉంటే వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు. లక్ష్మణచాంద మండలం కనకాపూర్‌లో రైతుల సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేయాలనుకున్నామని, వర్షం కారణంగా వాయిదా వేశామని చెప్పారు. గోదావరిపై నిర్మించిన సదర్మాట్ ప్రాజెక్టును త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించుకుంటామని వెల్లడించారు. ప్రభుత్వం రైతుభరోసా పేరిట పెట్టుబడి సాయం ఇవ్వడంపై కసరత్తు చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు వెంకట్రాంరెడ్డి, రఘునందన్ రెడ్డి, మురళీధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ప్రదీప్, శ్రీధర్, రాంచందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



నిర్మల్‌టౌన్: పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాధిక

**నిర్మల్‌టౌన్:** న్యాయపరమైన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి జీ రాధిక సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కస్బా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి రాజ్యాంగంలోని న్యాయపరమైన చట్టాలను విద్యార్థులకు వివరించారు. బాలికల చట్టాలను ఎలా వినియోగించుకోవాలో విద్యార్థినులకు వివరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. నిర్మల్ చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ రాజలింగం, న్యాయవాదులు మధుకర్, పాఠశాల ప్రిన్సిపాల్ వాణి, ఉపాధ్యాయులు సాయన్న, దశరథ్, భూమన్న తదితరులు పాల్గొన్నారు.

**పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత**



భైంసాటౌన్: మొక్క నాటి నీరు పోస్తున్న జిల్లా కోర్టు, సెషన్ జడ్జి, ఏఎస్పీ

**భైంసాటౌన్:** మొక్కల పెంపకంతోనే పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని జిల్లా కోర్టు, సెషన్ జడ్జి కర్ణకుమార్ సూచించారు. వనమహోత్సవంలో భాగంగా శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో జడ్జి డీ దేవేంద్రబాబు, ఏఎస్పీ అవినాష్‌కుమార్‌తో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. మొక్కలు నాటేందుకు ఇదే అనువైన సమయమని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## నెలాఖరు దాకా బదిలీలు

- గడువు పొడగించిన ప్రభుత్వం
- ఇప్పటికే పలువురి బదిలీ

**నిర్మల్:** సాధారణ బదిలీల ప్రక్రియను ప్రభుత్వం మరో పదిరోజులు పొడగించింది. ఈనెల 20వ తేదీతోనే ఈ ప్రక్రియ ముగిసిపోగా, చివరిరోజున ఈనెలాఖరు వరకు పొడగిస్తున్నట్లు ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జీవో విడుదల చేశారు. ఈమేరకు ఈనెల 31వ తేదీ వరకు బదిలీలు పూర్తిచేసుకుని, ఆగస్టు ఒకటో తేదీ నుంచి కొత్త విధులు చేపట్టాల్సి ఉంటుంది.

**ఇప్పటికే పూర్తి..**

సాధారణ బదిలీల ప్రక్రియలో భాగంగా జిల్లాలో దాదాపు అన్నిశాఖల్లో బదిలీలు పూర్తయ్యాయి. జిల్లాలో అంతర్గత పోస్టుల బదిలీలన్నీ పూర్తికాగా, జిల్లా, జోనల్ పోస్టుల ప్రక్రియ శనివారం రాత్రి వరకూ కొనసాగుతూనే ఉంది. మిగతావి ఈనెలాఖరు వరకు చేపట్టనున్నారు. ప్రస్తుతం ఆయా శాఖల్లో పనిచేస్తున్న వారిలో 40శాతం ఉద్యోగులను బదిలీ చేస్తున్నారు. అలాగే ప్రభుత్వ నిబంధనల ప్రకారం 3–4 ఏళ్ల వరకు ఒకేస్థానంలో ఉన్నవారిని కదిలిస్తున్నారు.

**పలువురు జిల్లా అధికారులూ..**

సాధారణ బదిలీల్లో పలువురు జిల్లా అధికారులూ వెళ్లిపోనున్నారు. ప్రధానంగా డీఆర్డీవో, ఫిషరీస్ ఏడీ తదితరులు బదిలీపై వెళ్లనున్నట్లు చెబుతున్నారు. రెవెన్యూలో ఇప్పటికే 10మంది జూనియర్ అసిస్టెంట్లు, ఆరుగురు సీనియర్ అసిస్టెంట్లు, ఐదుగురు డీటీలు బదిలీ అయ్యారు. పంచాయతీశాఖలో తొమ్మిదిమంది ఎంపీవోలు బదిలీ కాగా, ఇద్దరు ఇతర జిల్లాలకు వెళ్తున్నారు. జిల్లాకు కొత్తగా ముగ్గురు వస్తున్నారు. పంచాయతీ కార్యదర్శుల్లో గ్రేడ్–2 ఇద్దరు, గ్రేడ్–3 12మంది, గ్రేడ్–4 118మంది బదిలీ అయ్యారు. నర్సాపూర్ 30పడకల ఆస్పత్రిలో సీనియర్ వైద్యులుగా ఉన్నవారంతా బదిలీ అయ్యారు. ఇందులో కొందరు ఖానాపూర్ సీహెచ్‌సీ, మరికొందరు భైంసా ఏరియా ఆస్పత్రికి వెళ్లారు. వివిధ శాఖల్లోనూ జూనియర్, సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్, జిల్లా అంతర్గత స్థాయి పోస్టుల బదిలీ ప్రక్రియ దాదాపు పూర్తయింది.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- ప్రతీరోజు ఫాగింగ్ చేయిస్తున్నాం
- డ్రెయినేజీల్లో పూడిక తీయిస్తున్నాం
- 'సాక్షి ఫోన్‌ఇన్‌లో' ఖానాపూర్, భైంసా మున్సిపల్ కమిషనర్లు



'సాక్షి ఫోన్ ఇన్'లో మాట్లాడుతున్న కమిషనర్ మనోహర్



ఫోన్‌లో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కమిషనర్ సుదర్శన్‌రెడ్డి

సాక్షి ఫోన్ ఇన్

**ఖానాపూర్:** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వ ఆదేశానుసారం ప్రజారోగ్యంపై ప్రత్యేక చర్యలు చేపడతామని ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ మనోహర్ పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన 'సాక్షి ఫోన్‌ఇన్'లో ప్రజలు తెలిపిన సమస్యలకు ఆయన సమాధానాలిచ్చారు.

**ప్రశ్న:** పట్టణంలో కోతులు, కుక్కలు, పందుల సమస్య ఎక్కువైంది.
– భీమనర్సయ్య, శాంతినగర్

**కమిషనర్:** పందుల పెంపకందారులకు నోటీసులిచ్చాం. కోతులు, కుక్కలు, పందుల సమస్య పరిష్కారానికి కౌన్సిల్‌లో తీర్మానించాం.

**ప్ర:** ప్రధానరోడ్డుపై నీరు నిలుస్తోంది. దోమల బెడద ఎక్కువైంది. పరిష్కరించాలి.
– అభిషేక్, విద్యానగర్

**కమిషనర్:** దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. రోడ్లపై నీరున్న చోట డస్ట్ వేయిస్తాం.

**ప్ర:** నూతనంగా ఏర్పాటైన కాలనీల్లోని రోడ్లు బురదగా మారాయి. ఓపెన్‌ప్లాట్లలో పిచ్చిమొక్కలు పెరిగి పాముల బెడద ఉంది.
– శ్రీనివాస్, శాంతినగర్

**కమిషనర్:** నూతన మున్సిపాలిటీ కావడంతో నిధుల కొరత ఉంది. కచ్చా డ్రైన్‌లు ఏర్పాటు చేసి నీరు నిల్వకుండా చర్యలు చేపడతాం. పలువురు ఓపెన్ ప్లాట్ల యజమానులకు గతంలో నోటీసులిచ్చాం. మిగతా వారికీ ఇస్తాం.

**ప్ర:** అంగడిబజార్ ఆవరణలో రావి, ఇతర చెట్ల కొమ్మలు ఇళ్లపైకి వచ్చాయి. ఆకులు రాలుతున్నాయి. కొమ్మలు విరిగిపడుతున్నాయి.
– గాదువు రవి, మొగల్‌పూర్

**కమిషనర్:** చెట్లను పరిశీలిస్తాం. అవసరమైతే వాటి కొమ్మలు తొలగిస్తాం.

**ప్ర:** మిషన్ భగీరథ పనుల సమయంలో ప్రధాన రోడ్లు ధ్వంసమయ్యాయి. 15 రోజుల క్రితమే సమస్య తెలిపినా పట్టించుకోవడం లేదు.
– గౌరికార్ రాజు

**కమిషనర్:** సమస్య నా దృష్టికి రాగానే సిబ్బందికి తెలిపాను. గుంత పడ్డ ప్రాంతం గుర్తించకపోవడంతో సమస్య పరిష్కారం కాలేదు. వెంటనే పద్మావతినగర్‌లోని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

**ప్ర:** కొద్ది నెలలుగా సమస్యలు విన్నవిస్తే అధికారులు వెంటనే పరిష్కరిస్తున్నారు. వానాకాలం పూర్తయ్యేదాకా ఇదే తరహాలో అందుబాటులో ఉండేలా చూడాలి.
– రాజశేఖర్, సాయినగర్

**కమిషనర్:** ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటున్నాం. ప్రజలు కూడా రోడ్లపై, ఇళ్ల వద్ద, మార్కెట్ ప్రాంతంలో ఆహారపదార్థాలు, చెత్త వేయొద్దు. తడి, పొడి చెత్త వేరు చేసి చెత్త బండ్లలో వేయాలి. ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 8730293005 టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశాం.

**భైంసాటౌన్:** వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. దీంతో మున్సిపల్ ఆధ్వర్యంలో చేపడుతున్న చర్యలపై ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ సుదర్శన్‌రెడ్డితో శనివారం 'సాక్షి ఫోన్ ఇన్' నిర్వహించింది. ఈ సందర్భంగా పలువురు పట్టణవాసులు ఆయనకు ఫోన్ చేసి సమస్యలు వివరించగా పరిష్కరిస్తామని చెప్పారు.

**ప్రశ్న:** ఏపీనగర్‌లో కచ్చా డ్రెయిన్లు ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. పందుల సంచారంతో వ్యాధులు ప్రబలే అవకాశముంది. బ్లీచింగ్ పౌడర్ చల్లించాలి.
– మోహన్, ఏపీనగర్

**కమిషనర్:** పారిశుద్ధ్య కార్మికులతో డ్రెయిన్లు శుభ్రం చేయిస్తాం. బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తాం.

**ప్ర:** శివారుకాలనీల్లో సీసీ డ్రెయిన్లు లేక మురుగు నీరు రోడ్లపై పారుతోంది. ఇబ్బందులు పడుతున్నాం. సీసీ డ్రెయిన్లు నిర్మించాలి.
– రమేశ్, ఏపీనగర్

**కమిషనర్:** శివారు కాలనీల్లో సీసీ డ్రెయిన్లు నిర్మిస్తాం. బడ్జెట్ రాగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం.

**ప్ర:** పులేనగర్‌లో చెత్త సేకరణ వాహనాలు సక్రమంగా రావడం లేదు. ఇంటింటా చెత్త సేకరించడం లేదు. డ్రెయినేజీల్లో పందులు తిరుగుతున్నాయి. సమస్య పరిష్కరించాలి.
– శ్రీనివాస్, పులేనగర్

**కమిషనర్:** డ్రెయినేజీలను పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయిస్తాం. చెత్త సేకరణ వాహనాలు వచ్చేలా సిబ్బందికి సూచిస్తాం.

**ప్ర:** కిసాన్‌గల్లిలో మిషన్ భగీరథ కారణంగా కాలనీల్లో రోడ్లపై గుంతలు పడి నీరు నిలుస్తోంది. దోమలు అధికమయ్యాయి. నివారణ చర్యలు చేపట్టాలి.
– నరేశ్, కిసాన్‌గల్లి

**కమిషనర్:** రోడ్లపై నిలిచిన నీటి తొలగింపు చర్యలు చేపడతాం. దోమల నివారణకు సిబ్బందితో ఫాగింగ్ చేయిస్తాం.

**ప్ర:** పురాణబజార్‌లోని మా ఇంటి ప్రాంతంలో ఏడాదిగా డ్రెయినేజీ శుభ్రం చేయడం లేదు. సొంతంగా శుభ్రం చేసుకుంటున్నాం. కచ్చా డ్రెయినేజీ కారణంగా నీరు పారడం లేదు. సీసీ డ్రెయినేజీ నిర్మించాలి.
– రఘునాథ్, పురాణబజార్

**కమిషనర్:** డ్రెయినేజీలో పేరుకు పోయిన పూడికను పారిశుద్ధ్య కార్మికులతో తీయిస్తాం. సీసీ డ్రెయిన్ నిర్మాణానికి ప్రతిపాదిస్తాం.

**ప్ర:** భట్టిగల్లిలోని బద్ది పోచమ్మ ఆలయ సమీపంలో ఇనుప స్తంభం ప్రమాదకరంగా ఉంది. వర్షాల కారణంగా ప్రమాదం జరిగే అవకాశముంది. వెంటనే సమస్య పరిష్కరించాలి. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి.
– నవీన్, భట్టిగల్లి

**కమిషనర్:** వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నాం. డ్రెయిన్లు శుభ్రం చేయిస్తున్నాం.

## ఇష్టారాజ్యంగా అంగన్‌వాడీలు!

**భైంసాటౌన్:** భైంసా ఐసీడీఎస్ పరిధిలో పలు అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఇష్టారాజ్యంగా మారింది. కేంద్రాలు సకాలంలో తెరవడంలేదు. సమయపాలన పాటించడం లేదు. శనివారం పట్టణంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రం తెరుచుకోకపోవడంతో చిన్నారులు ఇళ్లకే పరిమితమయ్యారు. స్థానికులు 'సాక్షి' దృష్టికి తేగా, సీడీపీవో శ్రీమతిని ఫోన్‌లో సంప్రదిస్తే సదరు కేంద్రం టీచర్ సెలవులో ఉన్నారని, ఆయాకు జ్వరం కారణంగా కేంద్రం ఆలస్యంగా తెరిచినట్లు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని తెలిపారు. ఈ ఒక్కచోటే కాదు పట్టణ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా తెరుచుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ విషయం పలుసార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినపుడు మందలించి వదిలేస్తున్నారు. తరువాత కొద్దిరోజులకు అదే తీరున వ్యవహరిస్తున్నారు. ఆయా సెక్టార్ల పరిధిలో సూపర్‌వైజర్ల పర్యవేక్షణ లేకపోవడంతోనే సక్రమంగా విధులు నిర్వహించడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఓ వైపు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసే దిశగా చర్యలు చేపడుతుంటే, కొందరి కారణంగా అభాసుపాలవుతోంది.

## పారిశుధ్య కార్మికులను నియమించాలి



మాట్లాడుతున్న భూమన్న యాదవ్

**నిర్మల్ రూరల్:** పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమోషన్లు, బదిలీల ద్వారా ఏర్పడిన ఖాళీల్లో విద్యావలంటీర్లను నియమించి విద్యాప్రమాణాలను కాపాడాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, టీఎస్ జీఎల్ఐ, మెడికల్ బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జుట్టు గజేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జే లక్ష్మణ్, బీ వెంకటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, ఇంతియాజ్ హైమాద్, డేవిడ్ గంగన్న, శివలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### నేడు కడెం ఆయకట్టుకు నీటి విడుదల



మాట్లాడుతున్న నాయకులు

కడెం/దండేపల్లి: కడెం ప్రాజెక్ట్ ఆయకట్టు కాలువలకు ఆదివారం సాగునీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్ట్ ఈఈ విఠల్ పేర్కొన్నారు. ప్రాజెక్ట్ నీటిమట్టం 690 అడుగులు దాటడంతో కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సాగునీటి విడుదలకు ఖానాపూర్, మంచిర్యాల ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, కొక్కిరాల ప్రేంసాగర్ రావు రానున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లేశ్ శనివారం తెలిపారు.

### పేకాటరాయుళ్ల అరెస్టు

లోకేశ్వరం: మండలంలోని ఎడ్దూర్ శివారు ప్రాంతంలో పేకాటరాయుళ్లను శనివారం అరెస్టు చేశామని ఎస్సై సక్రియనాయక్ తెలిపారు. పక్కా సమాచారంతోనే దాడి చేసి ఆరుగురు పేకాటరాయుళ్లను పట్టుకుని వారి వద్ద నుంచి రూ.9300 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

### పురుగుల మందు తాగి ఆత్మహత్య


కొట్టె కిరణ్ (ఫైల్)

కడెం: పురుగుల మందు తాగి యవకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఎం.కృష్ణసాగర్ రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని పాండ్వపూర్ గ్రామానికి చెందిన కొట్టె కిరణ్(28) ఈనెల12న భార్య మానుషతో మనస్పర్థలు వచ్చాయి. దీంతో కిరణ్ మనస్తాపం చెంది గ్రామ సమీపంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నిర్మల్ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం మృతిచెందాడు. మృతుడి తండ్రి రమేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

### ఉరేసుకొని ఆత్మహత్య


ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అడ్డగుట్ట గ్రామానికి చెందిన మడావి సాయి (23) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై ఎండీ జాహిరొద్దీన్ కథనం ప్రకారం.. సాయి వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొన్ని నెలలుగా ఆయన ఛాతీనొప్పితో బాధపడుతున్నాడు. ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకున్నాడు. శనివారం తెల్లవారుజాము చూసే సరికి మృతి చెంది ఉన్నాడు. తండ్రి రాజు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

### పాన్‌షాప్‌లో చోరీ

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని విశ్వనాథ్‌పేట్‌లోని పాన్‌షాప్‌లో గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. రూ.2 వేల నగదు, వస్తువులను ఎత్తుకెళ్లారని యజమాని తెలిపాడు. నలుగురు యువకులు చోరీకి పాల్పడినట్లు సీసీటీవీ ఫుటేజీలో రికార్డు అయింది.



## కుంటాలకు జలసోయగం



నేరడిగొండ: ఏకధాటిగా వర్షం కురుస్తుండడంతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఎగువ ప్రాంతంలో వాన కురవడంతో కుంటాల జలపాతానికి నీరు పోటెత్తుతోంది. ఆయా గ్రామాల్లో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి.

## దుబాయిలో వంజర్‌వాసి మృతి

- గుండెపోటుతో కార్మికుడు..
- రెండు రోజుల తర్వాత ఆలస్యంగా వెలుగులోకి


స్వదేశ్ పరికిండ్లకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

సారంగపూర్: దుబాయిలో వంజర్‌వాసి గుండెపోటుతో మృతిచెందాడు. రెండురోజుల తర్వాత ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దుబాయిలోని ఎంబసీ పీఆర్వో ఫోన్‌ద్వారా శనివారం కుటుంబీకులకు సమాచారం అందించారు. కుటుంబీకులు తెలిపిన వివరాలు.. మండలంలోని వంజర్ గ్రామానికి చెందిన భోగు లక్ష్మణ్ (39) మూడేళ్ల క్రితం దుబాయిలోని అబుదాబిలో లేబర్ పని చేసేందుకు వెళ్లాడు. గురువారం పనిచేస్తుండగా గుండెపోటుతో కుప్పకూలాడు. ఇతరులు గమనించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని కంపెనీ ప్రతినిధులకు అప్పగించారు. స్వదేశానికి త్వరగా రప్పించేలా ఏర్పాట్లు చేయాలని మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిండ్లను కలిసి వినతిపత్రం అందించారు. అబుదాబి యూనియన్ అధ్యక్షుడు బత్తిని రాజాగౌడ్‌కు వివరాలు అందజేశారు. భారత రాయబార కార్యాలయానికి ఈమెయిల్ ద్వారా వివరాలను పంపారు. మృతుడికి భార్య వనిత, వృద్ధురాలైన తల్లి, ఐదేళ్ల కుమారుడు ఉన్నారు. కుటుంబానికి ఆసరాగా నిలిచే క్రమంలో కుటుంబ పెద్ద మృతిచెందడంతో వారు చేసిన రోదనలు మిన్నంటాయి.

## ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీ


ప్రమాదానికి గురైన వాహనాలు

బాసర: బాసర ఆర్జీయూకేటీ మూలమలుపు వద్ద శనివారం బొలారో, టాటాఏస్ వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. నిజామాబాద్ నుంచి మహారాష్ట్రలోని బోకర్ తాలూకాకు టమాటా లోడ్‌తో బొలారో గూడ్స్ వెళ్తోంది. భైంసా నుంచి వస్తున్న టాటాఏస్ వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు డ్రైవర్లకు తీవ్రగాయాలయ్యాయి. తోటి ప్రయాణికులు గమనించి వారిని అంబులెన్స్‌లో భైంసా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఎదురెదురుగా బైక్‌లు ఢీ

- ఒకరు మృతి


రాజేందర్ (ఫైల్)

దండేపల్లి: మండలంలోని గూడెం సమీపంలో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొంది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందారు. ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం..కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం మడిపల్లికి చెందిన వొల్లాల రాజేందర్ (39) శుక్రవారం రాత్రి బైక్‌పై లక్సెట్టిపేట నుంచి గూడెం వైపు వెళ్తున్నాడు. గూడెం సమీపంలో అదేగ్రామానికి చెందిన అక్షయ్ బైక్‌ను రాంగ్ రూట్లో అతివేగంగా అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి రాజేందర్ బైక్‌ను ఎదురుగా ఢీకొట్టాడు. రాజేందర్ తలకు తీవ్రగాయమైంది. చికిత్స నిమిత్తం లక్సెట్టిపేట ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య శారద ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ సామగ్రి చోరీ


వివరాలు తెలుసుకుంటున్న సీఐ, ఎస్సై

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని తక్కళ్లపల్లి శివారులో బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ నిర్మాణ కోసం సిద్ధంగా ఉంచిన సామగ్రిని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బీఎస్ఎన్ఎల్ సంస్థ ఈనెల 9న రూ.8.84 లక్షల విలువైన 10.129 టన్నుల సామగ్రిని సెల్‌టవర్ నిర్మాణ స్థలం వద్ద నిల్వ చేశారు. ప్రతీరోజు సంబంధిత వ్యక్తులు సామగ్రిని పరిశీలిస్తూ వెళ్తున్నారు. శనివారం ఉదయం రాగా 7.3 టన్నుల సామగ్రి చోరీకి గురైందని ఏరియా మేనేజర్ షేక్ అబ్దుల్ ఖాదర్ ఫిర్యాదు చేశారు. ఎస్సైతో కలిసి రెబ్బెన సీఐ చిట్టిబాబు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### 108లో ప్రసవం


శిశువు, మహిళతో సిబ్బంది

లక్సెట్టిపేట: మండలంలోని పోచంపల్లికి చెంది న గర్భిణి విజయ పురిటినొప్పులతో బాధపడుతుంది. శనివారం ఆమె కుటుంబ సభ్యులు 108కి ఫోన్ చేసి సమాచారం అందించారు. సి బ్బంది అక్కడికి చేరుకుని ఆమెను మంచిర్యాల మాతాశిశు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు అధికమయ్యాయి. వా హనం ఆపి ప్రసవం చేసినట్లు ఈఎంటీ పేరం అనిల్, పైలట్ గంగన్న తెలిపారు. రెండో కా న్పులో మగబిడ్డ జన్మించాడు. తల్లీబిడ్డను ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపారు.

### జీవితంపై విరక్తితో ఆత్మహత్య

భీమిని: పిల్లల లేరని, జీవితంపై విరక్తితో వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పా ల్పడ్డాడు. కన్నెపల్లి ఎస్సై గంగారాం కథనం ప్రకారం.. కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి పంచాయతీ పరిధిలోని కొత్తపల్లికి చెందిన గట్టు రాజయ్య(50), భార్య దంపతులు. వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నారు. పెళ్లయి 30 ఏళ్లయినా పిల్లలు లేరని రాజయ్య మదనపడేవాడు. ఈక్రమంలో ఈనెల 18న సాయంత్రం మద్యం తాగి ఇంటికి వచ్చాడు. రాత్రి తెలిసిన వారి బర్త్‌డే ఉందని వెళ్లి తిరిగిరాలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. కొత్తపల్లిశివారు నీలగిరి తోటలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివా రం పశువుల కాపర్లు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. భార్య ఫిర్యాదుతో ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### కొడుకుకు తలకొరివి పెట్టిన తల్లి


అంత్యక్రియలకు వెళ్తున్న తల్లి పోశక్క

నెన్నెల: ఒక్కగానొక్క కొడుకు ఆత్మహత్యకు పాల్పడగా, అంత్యక్రియల్లో తల్లి కొరివి పెట్టింది. మండలంలోని గన్‌పూర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పోలంపల్లి మల్లేశ్ (28) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ యువకుడి తండ్రి చిన్నతనంలో చనిపోగా మృతుడు మల్లేశ్ భార్య గొడవపడి పుట్టింట్లో ఉంటుంది. వీరికి పిల్లలు లేరు. ఒక్కగానొక్క కొడుకు చనిపోవడంతో ఆ తల్లి గుండెను రాయిచేసుకొని కొరివిపెట్టింది. తాను చనిపోతే కొరివిపెట్టాల్సిన కొడుకుకి తానే చితి పెట్టానని ఆ తల్లి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

# అధిక తేమతో పంటలకు చేటు

- జాగ్రత్తలు పాటిస్తే మేలు


సంకె శ్రీనివాస్, ఏవో, చెన్నూర్


పత్తి చేనులో నిలిచిన వర్షపు నీరు

చెన్నూర్‌రూరల్: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంట చేలల్లో నీరు నిలుస్తుంది. నీరు ఎక్కువైతే తేమతో పంటలకు నష్టం వాటిల్లనుంది. అధిక తేమతో పంటలు నష్టపోకుండా ఉండాలంటే జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో సంకె శ్రీనివాస్ పలు సూచనలు, సలహాలు అందజేశారు. వర్షాలకు పత్తి చేనులో నీరు నిలిస్తే వెంటనే చేనులో నీరు నిల్వకుండా కాలువలు తీసి చేనులో ఉన్న నీటిని బయటకు పంపించాలి. వర్షాలు తగ్గిన వెంటనే భూమిలో తేమ తగ్గించుకోవడానికి అంతర సేద్యం చేయాలి. వర్షాలు తగ్గాక బురద పదనులో ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులు వేసుకోవాలి. అలాగే ఎకరాకు సీఓసీ 3 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. ఒకరోజు తర్వాత స్వర్ణపాల్‌ను కిలో తీసుకొని 150 లీటర్ల నీటికి కలిపి ఎకరాకు పిచికారి చేసుకోవాలి. వేరుకుల్లు తెగులు ఆశిస్తే 3 గ్రాముల ఆక్సిక్లోరైడ్ లేదా ఒక గ్రాము కార్బండిజమ్‌ను లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్లలో తడపాలి. మొక్కజొన్న పంట అధిక తేమను తట్టుకోలేదు. సాధ్యమైనంత త్వరగా అంతరకృషి చేసుకోవాలి. ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువును మొక్కల మొదళ్ల వద్ద వేసుకోవాలి. కాండం తొలిచే పురుగు ఉంటే కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు 3 కిలోలు ఆకుసుడుల్లో వేయాలి. పెసర, మినుము పైర్లకు అధిక తేమతో పేనుబంక, లద్దె పురుగు ఆ శించే అవకాశం ఉంది. ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. మిరప పంటలో నీరు నిలిస్తే వెంటనే నీటిని కాలువల ద్వారా తొలగించాలి. నారుకుళ్లు తె గులు ఆశిస్తే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. 3 గ్రా ముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా 2 గ్రాముల రిడోమిల్ లీటరు నీటికి కలిపి వారంలో రెండు, మూడుసార్లు పిచికారి చేయాలి. ఇలాంటి జాగ్రత్తలు పాటిస్తే అధిక తేమ నుంచి పంటలను కాపాడుకోవచ్చు.

### వైద్యసిబ్బందికి అభినందనలు


Office of Minister for Health, Telang...
@TelanganaHealth
I Appreciate The effort of the Medical Officer, ANM, ASHA & all the front line warriors for serving good Health Services in Tribal Area.
District Medical & Health Officer, Adila... · 1d
@narendramodi @PMOIndia @TribalAffairsIn @JPNadda @Bishweswar_Tudu @DrBharatippawar @PIB_India @mygovindia @AmritMahotsav @TelanganaCMO @DamodarCilarapu @TelanganaHealth @ts_health @Collector_ADB #...
కాలినడకన వెళ్లి.. వైద్యం అందించి..

ట్విటర్‌లో సాక్షి కథనాన్ని పోస్టు చేసిన మంత్రి రాజనర్సింహ

ఇచ్చోడ: మండలంలోని నర్సాపూర్ పీహెచ్‌సీ వైద్య సిబ్బందిని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శనివారం ట్విటర్ వేదికగా అభినందించారు. బురదరోడ్డులో సిబ్బంది 2 కి.మీ దూరం కాలినడకన వెళ్లి రాజులగూడలో వైద్యం అందించారు. ఈ తీరును వివరిస్తూ కాలినడకన వెళ్లి.. వైద్యం అందించి..'సాక్షి'లో ప్రచురితమైన కథనాన్ని ట్విటర్‌లో పోస్టు చేశారు. గిరిజన ప్రాంతాల్లో వైద్యసిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయన్నారు.

### పలువురు తహసీల్దార్లకు స్థానచలనం

కై లాస్‌నగర్: జిల్లాలో పనిచేస్తున్న పలువురు తహసీల్దార్లకు స్థానచలనం కలిగింది. ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్‌లో వారిని బదిలీ చేశారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఏ.రాజేశ్వర్‌ను నిర్మల్‌కు, గుడిహత్నూర్ తహసీల్దార్ ఎస్.కవితారెడ్డి, హైకోర్టు లైజన్ అధికారి టి.పద్మజ, నేరడిగొండ తహసీల్దార్ ఎస్.సంతోశ్‌రెడ్డిని నిజామాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. బేల తహసీల్దార్ కె.సవాయిసింగ్, సిరికొండ తహసీల్దార్ పి.విజయ్‌కుమార్‌ను కామారెడ్డి జిల్లాకు, కలెక్టరేట్ ఏవో అరవింద్‌కుమార్, ఆదిలాబాద్‌రూరల్ తహసీల్దార్ ఎ.దిలీప్‌కుమార్‌ను మంచిర్యాల జిల్లాకు కేటాయించారు. వీరిలో ఏవో నాలుగేళ్ల సర్వీస్ పూర్తి కాగా, మిగతా వారిని స్పౌజ్ గ్రౌండ్ కింద బదిలీ చేస్తూ సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

### ఒకరి రిమాండ్

నర్సాపూర్(జి): మండలంలోని నందన్ ఎక్స్ రోడ్ వద్ద శుక్రవారం సాయంత్రం ఎస్సై హన్మాండ్లు వాహనాలు తనిఖీ చేపట్టారు. బామినితండాకు చెందిన పవార్ లవకుశ్ బైక్‌పై వస్తుండగా పట్టుకుని విచారించారు. నర్సాపూర్(జి) శివారులోని నీలిమ వైన్స్, తెల్ల కల్లు దుకాణాల్లో బుధవారం రాత్రి షటర్ తాళాలు పగలగొట్టి సీసీ కెమెరాలు, డీవీఆర్ల ధ్వంసం, నగదు దొంగిలించానని నేరం ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్టు చేశారు. నిర్మల్ కోర్టు అతనికి రిమాండ్‌కు తరలించిందని ఎస్సై పేర్కొన్నారు.

### తప్పిపోయిన బాలుడి అప్పగింత



కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: తప్పిపోయిన బాలుడిని కుటుంబ సభ్యులకు మంచిర్యాల పోలీసులు అప్పగించారు. సీఐ బన్సిలాల్ కథనం ప్రకారం.. శనివారం స్థానిక రైల్వేస్టేషన్ ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తున్న బ్లూకోల్ట్స్ పోలీసులకు దివ్యాంగ బాలుడు రోదిస్తూ కనిపించాడు. అతన్ని విచారించగా చెన్నూర్ మండలం ఎర్రగుంటపల్లె గ్రామానికి చెందిన పందిళ్ల మహేశ్-సునీత దంపతుల కుమారుడు రాజేశ్ (10) అని తెలిసింది. వెంటనే కుటుంబీకులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. వారి కోరిక మేరకు బంధువు అయిన శ్యామలకు అప్పగించినట్లు తెలిపారు. బాలుడి ఆచూకీ తెలుసుకుని అప్పగించడంలో కీలకంగా వ్యవహరించిన ఏఎస్సై దివాకర్, రమేశ్‌లను డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్ అభినందించారు.

## చిట్యాలలో కార్డన్‌సెర్చ్


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

నిర్మల్‌రూరల్: మండలంలోని చిట్యాల గ్రామంలో డీఎస్పీ గంగారెడ్డి ఆధ్వర్యంలో శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఎలాంటి సమస్యలున్నా డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. గ్రామంలో స్పెషల్ క్యాంప్ ఏర్పాటు చేసి అర్హత ఉన్నవారికి లైసెన్సులు ఇచ్చే ఏర్పాటు చేస్తామన్నారు. అంతకు ముందు గ్రామంలో పత్రాలు లేని 102 బైక్‌లు, మూడు ఆటోలు, ఒక కారు, ఒక టాటా మ్యాజిక్, ఒక టెంపో వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సోన్ సీఐ నవీన్‌కుమార్, ఎస్సైలు సాయికుమార్, శ్రీకాంత్, రాజేశ్వర్‌గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే 'ఫోన్‌ఇన్'

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు


ఫోన్ ఇన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తెలిపారు. శనివారం ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామస్తులు, ఉద్యోగులు వందలాది మంది ఫోన్ ద్వారా నీటి, రోడ్డు, డ్రెయినేజీ, కరెంటు, భూమికి సంబంధిచిన, ఏజెన్సీలో డీఎస్సీ, పాఠశాలల్లో సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి.. సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు.

## కొనసాగుతున్న గురుపౌర్ణమి వేడుకలు


మంగళవాయిద్యాలతో వెళ్తున్న అర్చకులు, అధికారులు

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు రెండోరోజు కొనసాగుతున్నాయి. శనివారం సరస్వతి, మహాలక్ష్మి, మహంకాళి ఆలయాల్లో అర్చకులు, భక్తులు పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## ప్రభుత్వ ఎస్సీ కమ్యూనిటీ హాల్ తాకట్టు

- రూ.3లక్షల అభివృద్ధి పనులకు అప్పగింత
- మూడేళ్లపాటు రుణదాతకు నిర్వహణ బాధ్యతలు
- ఒప్పందంపై దళిత సంఘాల వ్యతిరేకత


ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనం

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లింది. సౌకర్యాల కల్పన కోసమని ఓ వ్యక్తి వద్ద నుంచి రూ.లక్షల్లో అప్పు తీసుకుని ఆ అప్పు తీరే వరకు నిర్వహణ బాధ్యతలు కట్టబెడుతూ దస్తావేజు రాసివ్వడం అభ్యంతరం వ్యక్తమవుతోంది. శుభ, అశుభ కార్యక్రమాలు, సభలు, సమావేశాల నిర్వహణకు కొన్నేళ్ల క్రితం జిల్లా పరిషత్ నిధులు వెచ్చించి బెల్లంపల్లిలో కాంటా చౌరస్తా పక్కన ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించారు. కొంత కాలం నిర్వహణ బాధ్యతలు మున్సిపల్ కమిషనర్ కనుసన్నల్లో కొనసాగగా, దళిత సంఘాల నాయకుల వద్ద కూడా తాళాలు ఉండేవి. కార్యక్రమాల నిర్వహణ తగ్గుముఖం పట్టడంతో కొంతకాలంపాటు వృథాగా ఉండిపోయింది. పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి కళావిహీనంగా తయారైంది. కమ్యూనిటీ హాల్‌లో సౌకర్యాల దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు కొందరు ఏకపక్షంగా వ్యవహరించి ఓ వ్యక్తి నుంచి రూ.3లక్షలు అప్పు తీసుకున్నారు. బాత్‌రూంలు, ప్లంబింగ్, కరెంట్ వైరింగ్ తదితర పనులు చేయించారు. బాకీ తీర్చే వరకు నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తున్నట్లు రుణదాతకు రూ.100 విలువైన దస్తావేజుపై లిఖిత పూర్వకంగా రాసివ్వడం చర్చనీయాంశమైంది. మూడేళ్లపాటు నిర్వహించుకునే హక్కు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కమ్యూనిటీ హాల్ తాకట్టు పెట్టడంపై మాజీ కౌన్సిలర్ పొట్ల సురేష్ తీవ్రంగా వ్యతిరేకించారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఒకరిద్దరు కుమ్మక్కై ఈ తతంగం నడిపించారని దళిత నాయకుడు రత్నం ఐలయ్య పేర్కొన్నారు. ఎవరినీ సంప్రదించలేదని తెలిపారు.

## అసత్య ఆరోపణలు చేసిన ముగ్గురి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం: మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, ఆయన అనుచరుడు జగన్‌మోహన్‌రావుపై అసత్య ఆరోపణలు చేసిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీసీపీ భాస్కర్ తెలిపారు. ఏసీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎమ్మెల్యే అండ చూసుకుని జగన్‌మోహన్‌రావు భూ కబ్జాలు, దాడులు, బెదిరింపులకు దిగుతున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రజనీష్ జైన్, పాత మంచిర్యాలకు చెందిన కొల్లూరి భాస్కర్(డాక్యుమెంట్ రైటర్), సీసీసీ నస్పూర్‌కు చెందిన పెరకొండ్ల సంపత్‌లు ఈనెల 2న మార్కెట్ ఏరియాలో పెన్నుతో రాసిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈనెల 4న జగన్‌మోహన్‌రావు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ పుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి శనివారం ఉదయం పోలీసులు మఫ్టీలో వారిని అరెస్టు చేశారు. గతంలో రజనీష్ జైన్, భాస్కర్‌పై రెండు భూకబ్జాల కేసులు నమోదయ్యాన్నారు. ఈ కేసుల్లో విచారణకు రాకుండా తప్పించుక తిరుగుతున్నారని డీసీపీ తెలిపారు. కాగా, కరపత్రాలు పంపిణీ చేసే సమయంలో వేసుకున్న డ్రెస్, రాసిన కరపత్రాలు, బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో ఏసీపీ ప్రకాశ్, సీఐ బన్సిలాల్, ఎస్సై ప్రశాంత్ పాల్గొన్నారు.